# చంద్రహారం

**రా**త్రి ఎనిమిదిన్నర అయింది. భోజనంచేసి వచ్చానో లేదో ఇంటాయన పిలిచాడు.

“రామచంద్రా నీకు ఫోన్” అన్నాడు.

వెళ్ళి రిసీవర్ తీసుకున్నాను. నాన్నగారు.

“చిన్నా నేనురా!” అన్నారు.

“ఏమిటి నాన్నగారూ?” అన్నాను.

“చిన్నా! మామ్మ” ఇక ఆ తరువాత మాట్లాడలేక పోయారు.

నా గుండె జారిపోయింది. ‘ఎప్పుడు?’ అడిగాను.

“ఇప్పుడే పది నిముషాలు అయింది” అన్నారు.

“నేను వస్తున్నాను” అని చెప్పాను. చెప్పవలసిన వారికి చెప్పి డబ్బు సమకూర్చుకుని బస్టాండుకి వచ్చేసరికి ఆఖరి బస్ వెళ్ళిపోయింది.

రోడ్డుమీదికి వచ్చి ఒక లారీ దొరికితే అందులో ఎక్కాను.

అర్ధరాత్రి దాటింది, ఇల్లు చేరేసరికి. అడుగుపడలేదు. నాన్న వచ్చి తీసుకువెళ్ళారు. ఇంటి ముందు స్థలంలో నాలుగు తడికెలు కట్టి అందులో పడుకోబెట్టారు మామ్మని. ప్రశాంతంగా ఉంది. పెద్దవాళ్ళు కొంతమంది హరినామ స్మరణ చేస్తున్నారు.

రాత్రంతా మనుషులు వస్తూనే ఉన్నారు.

తెల్లవారి తొమ్మిది గంటలకి నాలుగు క్వాలిస్‌లు వచ్చాయి. హైదరాబాదునించి పెద్దనాన్న, అమ్మ, పెద్దత్తయ్య, చిన్నత్తయ్య, మామయ్యలు, వాళ్ళ పిల్లలూ అందరూ వచ్చారు.

మామ్మకేం తక్కువ? పిల్లలు ప్రయోజకులు అయ్యారు. మనవలూ వృద్ధిలోకి వచ్చారు. అందరం కలిసి ఆర్భాటంగా సాగనంపాం.

భోజనాలు అయ్యాక సెలవులు లేవని నా కజిన్స్ అందరూ తిరుగు ప్రయాణం అయ్యారు.

"నువ్వూ వస్తావుట్రా డ్రాప్ చేసి వెళ్తాం" అన్నాడు మా సూర్యం అన్నయ్య.

"లేదులే నేను పదిహేను రోజులు సెలవు పెట్టి వచ్చాను" అన్నాను.

"భేషైన పనిచేశావురా! నువ్వుంటే మీ నాన్నకి కొండంత అండ" అన్నాడు తలపండిన తాతయ్య వరసాయన.

"ఎంతైనా వాడికి మామ్మంటే అభిమానం" అంది. మరో ముసలావిడ.

అమ్మకి కోపం వచ్చింది. "అభిమానాలు ఎవరికి లేవుట? పెద్ద పెద్ద ఉద్యోగాలు చేసుకునేవాళ్ళకి అన్నేసి రోజులు సెలవులు దొరకద్దూ" అంది విసురుగా.

ఆ మాట నిజమే. మా పెద్దనాన్న పిల్లలు, అత్తయ్యల పిల్లలూ అందరూ పెద్ద పెద్ద ఉద్యోగస్తులు. వేలకొద్దీ సంపాదనలు. నేను ఒక చిన్న ఊళ్ళో గ్రామీణ బ్యాంకులో అటెండరుని.

నాకు చిన్నప్పటినుంచి చదువు అబ్బలేదు. ఇంట్లో ఉండి మామ్మ గారం ఎక్కువై పాడైపోతున్నానని తన వెంట తీసికెళ్ళాడు మా పెద్దనాన్న. వారం తిరక్కుండా పారిపోయి వచ్చేశాను. నా కర్మకి నన్నొదిలేశారు.

ఇంటరు గట్టెక్కించి ఇక చదవనని మొండికేస్తే బ్యాంకులో అటెండరు ఉద్యోగం ఇప్పించాడు మా పెద్ద మామయ్య.

మా అమ్మ బాధపడితే "వాళ్ళంతా బంగారాలు తింటారా, వీడు తినకపోతాడా" అంది మామ్మ.

రెండో రోజునుంచే మామ్మ కర్మ ప్రారంభించారు. ఆమ్మ, పెద్దనాన్న, అత్తయ్యలిద్దరూ మాత్రమే ఉన్నారు. మిగిలినవారంతా వెళ్ళిపోయారు.

ఇంటిపనంతా అమ్మ చూసుకుంటూ ఉంటే ఆమ్మ, అత్తయ్యలూ కబుర్లు చెప్పుకుంటూ కాఫీలు తాగుతూ కాలక్షేపం చేసేవాళ్లు.

"మొన్ననే కూకట్‌పల్లిలో స్థలం కొన్నాం. పది లక్షలు అయింది. అందులో ఓ ఇల్లు కట్టిపారేస్తే పిల్లలిద్దరికీ చెరో ఇల్లూ అమరుతుంది..."

"డైమండ్ ఎగ్జిబిషన్‌లో డైమండ్ సెట్ కొనుక్కున్నా, చౌకగానే వచ్చింది. రెండు లక్షలు..." అంటూ లక్షల మీద మాట్లాడుకుంటారు.

మా పెద్దనాన్న, పెద్ద మామయ్యా ఒకే డిపార్టుమెంటు. సరిసమాన పదవులు. మా బావ దేశాన్ని దోచుకు తినేస్తున్నాడని ఈయనంటే, మా బామ్మరిది గుడినీ గుళ్ళో లింగాన్నీ మింగేస్తున్నాడనీ ఆయనంటూ ఒకరి గుట్టు మరొకరు బయటపెట్టేసుకుంటూ ఉంటారు. మా చిన్న మామయ్య కంట్రాక్టరు దిట్టంగా సంపాదిస్తున్నాడు. మాకో బాబాయి ఉన్నాడు. అమెరికాలో ఉంటాడు. అమెరికా వెళ్ళాక నాలుగైదుసార్లు వచ్చాడు అంతే. వాళ్ళ పిల్లలని ఫోటోల్లో చూడటమే.

✧ ✧ ✧

మామ్మ కర్మకాండ సలక్షణంగా ముగిసింది.

పన్నెండోరోజు ఆశీర్వచనం అయిపోయింది. అంతా వెళ్ళిపోయారు. పెద్దనాన్న, అత్తయ్యలు కూడా ప్రయాణం అయ్యారు.

"క్రిష్ణా, అమ్మ బంగారం ఆడపిల్లలకి ఇవ్వాలిగా" అన్నారు పెద్దనాన్న.

"అలాగే అన్నయ్యా అమ్మకి మూడు పేటల చంద్రహారం ఉంది. అది ఇద్దరూ ఎలా పంచుకుంటారో వాళ్ళిష్టం" అన్నారు నాన్న.

"అమ్మేసి చెరిసగం తీసుకుంటాం" అంది పెద్దత్తయ్య.

ఎన్నాళ్ళనుంచో నా మనసులో ఉన్న కోరిక బయటపెట్టాను.

"మామ్మ చంద్రహారం నాకు కావాలి" అన్నాను.

అందరూ తెల్లబోయారు.

"అదేమిట్రా మా అమ్మ బంగారం నీకెలా వస్తుంది" అంది చిన్నత్తయ్య.

"ఇది వాడికి పుట్టిన బుద్ధికాదులేవే సుధా. వెనక పెద్దవాళ్ళుండి నాటకం ఆడిస్తున్నారు" అంది పెద్దత్తయ్య విసురుగా.

"ఏమిటీ ఆ మాటలు" అని కసిరారు నాన్న.

"అంత నాటకాలు ఆడాల్సిన కర్మ మాకేం పట్టలేదులేమ్మా" అంది అమ్మ.

వ్యవహారం ఇంకా ముదరకముందే నేను కల్పించుకున్నాను.

"నాకు ఊరికే వద్దు. దాని ధర నేనిస్తాను. నాకా చంద్రహారం కావాలి" అన్నాను.

అత్తయ్యల మొహాలు తేటపడ్డాయి. "సరే అయితే శ్రావణమాసంలో అమ్మ పేరు మీద కొత్త నగ చేయించుకుంటాం. ఈలోగా డబ్బిచ్చి పట్టుకెళ్ళు" అని గడువు పెట్టి వెళ్ళిపోయారు.

అమ్మ నా తల వాచేలా చివాట్లు పెట్టింది. "ఇప్పటికే పీకలదాకా మునిగి ఉన్నాం. పైగా ఇదొకటా? డబ్బిచ్చి కొనుక్కున్నా ఆ మాట తెలియనివాళ్ళు ఆ బంగారం మనం కాజేశాం అనుకుంటారు. ఎందుకొచ్చిన అప్రతిష్ఠ. నేనెందుకు చెప్తున్నానో అర్థం చేసుకో" అంది.

నేను వినలేదు.

రెండు నెలలు గడువుంది. ఆ నగ విలువ ముప్పైరెండు వేలట. అంత డబ్బు సమకూర్చడం నాబోటి సామాన్యుడికి మాటలు కాదు.

మోజుపడి కొనుక్కున్న సెకండ్‌హ్యాండ్ స్కూటర్ అమ్మేశాను. నా ఒంటిమీదున్న గొలుసు, ఉంగరాలు అమ్మేశాను. నెలవారీ కడుతున్న చీటీ పాడి తీసుకున్నాను. ఎలా అయితేనేం... డబ్బు సమకూర్చుకుని హైదరాబాద్ వెళ్ళి చిన్నత్తయ్యకి డబ్బు ఇచ్చి గొలుసు తీసుకున్నాను.

వెళ్ళకపోతే నిష్ఠూరాలు ఆడతారని పెద్దనాన్న ఇంటికి వెళ్ళాను. వివరాలు తెలుసుకుని బుగ్గలు నొక్కుకుంది అమ్మ. "ఈ మధ్య గ్రాముకి ముప్పై రూపాయలు తగ్గింది. అందులోనూ పాత బంగారం. బజార్లో అమ్మితే ఇరవై ఎనిమిది వేలకి మించి రాదు. ఆ మిగిలినది నీకు ఆవదం అంటించింది సుధ. నువ్వో వెర్రివెంగళప్పవి. ఇప్పుడంత డబ్బుపోసి ఆ మోటు నగ ఎందుకు చెప్పు. ఆ డబ్బు పెడితే కొత్త డిజైన్లు కోకొల్లలు" అంది.

నేనా మాటలేం పట్టించుకోలేదు. నాకు కొండెక్కినంత ఆనందంగా ఉంది. ఏదో నాలుగు మెతుకులు కతికి వచ్చి రైలెక్కాను.

ఇంటికివచ్చి అత్తయ్య ఇచ్చిన ప్లాస్టిక్ డబ్బా మూతతీసి చూశాను. కెంపురంగు పట్టుగుడ్డమూట. ఆ పట్టుచీరె మామ్మ పెళ్ళిదట. చిరిగిపోతే జరీ తీసి వెండి కరిగించిందట. ఆ చీరెని ముక్కలుగా చించి ఎన్నో విధాలుగా వాడుకునేది మామ్మ.

పదిలంగా మూట విప్పాను. మూడు పేటల చంద్రహారం. లక్ష్మీదేవి రాళ్ళబిళ్ళకి అయిదు రింగులు, మూడు రింగులకి గొలుసులు. రెండు రింగులు ఖాళీ.

కళ్ళ నీళ్ళు తిరిగాయి.

మా తాతయ్యని ఎరగను నేను. మా నాన్నంటే తాతయ్యకీ మామ్మకీ తగని అభిమానం. పై చదువులు చదివే అవకాశం ఉన్నా అనారోగ్యంగా ఉన్న తాతయ్యని వదిలివెళ్ళటం ఇష్టంలేక వ్యవసాయం చేసుకుంటూ ఇంటిపట్టునే ఉండిపోయారు నాన్న.

నేను పుట్టడమే అర్భకంగా పుట్టానుట. అమ్మకేదో జబ్బుచేసిందిట. అందుకే మామ్మే పెంచింది నన్ను.

నా ఊహ తెలిసేసరికి ఈ గొలుసు ఇలాగే ఉండేది మామ్మ మెడలో.

"ఇక్కడ ఖాళీలు ఉన్నాయేం" అని అడిగితే –

"అయిదు పేటల గొలుసు చిక్కిపోయి మూడు పేటలు అయింది మీ తాతయ్య ప్రయోజకత్వంవల్ల" అనేది నవ్వుతూ.

"తాతయ్య మంచివాడు కాడా?" అంటే–

"కళ్ళుపోతాయి వెధవకానా! మీ తాతయ్య చాలా మంచివాడు. ఖర్చులు ముంచుకొస్తుంటే ఆయన మాత్రం ఏం చేస్తారు? పెద్ద సంసారం, బాధ్యతలు... నా ఆరోగ్యం, నా ఐశ్వర్యం అనుకునే మనిషి కాదు. నాకు చాలానే ఉండేది బంగారం. వంకీ వడ్డాణం కాసులపేరు అన్నీ పోయాయి. ఇది ఒక్కటీ మాత్రం నన్ను అంటిపెట్టుకుని ఉంది" అనేది.

"ఇది అమ్మలేదా?" అంటే –

"అమ్మేవారే, అభిమానం అడ్డొచ్చింది. ఇది నా పుట్టింటివారు పెట్టిన బాలతొడుగు. అచ్చివచ్చిన ఆభరణం. అమ్మలేదన్న మాటేగానీ ఎన్నిసార్లు తాకట్టుకి వెళ్ళి తిరిగి వచ్చిందో లెక్కలేదు. ఎన్ని కష్టాలు గట్టెక్కించిందో, ఎన్ని అవసరాలకు ఆదుకుందో చెప్పలేను. మీ బాబాయి చదువుకి ఒక పేట, చిన్నదాని పెళ్ళికి ఇంకో పేట అమ్మాల్సి వచ్చింది. చాలా అభిమానపడ్డారు మీ తాతయ్య. పోయేలోగా నీ బాలతొడుగు బాకీ తీర్చాలి అనేవారు. తీర్చకుండానే పోయారు పాపం" అనేది మామ్మ.

సరే అప్పుడు అవసరం వచ్చింది. అమ్మేరు. మా నాన్న తప్ప మిగిలిన కొడుకులిద్దరూ బాగా వృద్ధిలోకి వచ్చారు. అమెరికాలో ఉన్న బాబాయీ ఇక్కడున్న పెద్దనాన్నా రెండు చేతులా సంపాదిస్తున్నారు. మా ఆమ్మ మెడ తిరక్కుండా నగలు చేయించుకుంటుంది.

"వాళ్ళ అవసరానికేగా నీ గొలుసు అమ్మేరు. నీకు రెండు గొలుసులు చేయించ కూడదా?" అంటే – నా నోరు నొక్కేసింది మామ్మ.

"ఇటువంటి మాటలు మాట్లాడి నా నెత్తిమీదికి తెస్తావా ఏం? వెధవ వాగుడూ నువ్వూనూ... నేను పెట్టినంత మాత్రాన వాళ్ళు పెట్టాలా. నేను తల్లినీ వాళ్ళు పిల్లలూ" అనేది గుంభనంగా.

పైకి చెప్పకపోయినా నాన్నమీద, మామీద ఆవిడకి అభిమానం ఎక్కువ. మిగిలినవారిలా మేము పైకి రాలేదని బాధపడేది. నాది సరే చిన్న ఉద్యోగం. మా అక్కయ్యని కూడా పల్లెటూర్లోనే ఇచ్చాం. మా బావదీ వ్యవసాయమే.

"కాస్త వాడిని కనిపెట్టి ఉండండి" అని మిగిలిన ఇద్దరికీ చెప్పేది.

కనిపెట్టి ఉండడం మాట దేవుడెరుగు, 'నీకు వాడంటే పక్షపాతం' అని నింద వేశారు.

"మా తరఫున వకాల్తా పుచ్చుకుని మీరు చెడ్డకాకండి అత్తయ్యా" అనేది అమ్మ.

తనెంత గుంభనంగా చెప్పినా ఆస్తిలో వాటాకి వచ్చిన కొడుకులిద్దరినీ చూసి బాధపడింది.

"వాళ్ళు తిరిగే చిన్నకారు విలువ చెయ్యదు ఈ ఆస్తి. ఆ కాస్తా తోడబుట్టినవాడికి వదిలి పెడదామనే ఇంగితం లేకపోయింది. ఏం మనుషులు" అనుకుంది.

"బాధపడకే అమ్మా. నాకేం తక్కువ? తినడానికి తిండి, ఉండడానికి ఇల్లూ ఉన్నాయి. అన్నింటినీ మించి నువ్వు నా దగ్గరున్నావు" అనేవారు నాన్న.

"నేనుండి నీకేం తవ్వి తలకెత్తుతున్నానురా?" అనేది మామ్మ.

మా మామ్మ మాకు కొండంత అండ. నా బుద్ధి తెలిశాక కూడా ఆవిడ చంద్రహారం తాకట్టుకి వెళ్ళి వస్తూనే ఉంది. మా అక్కయ్య పెళ్ళికీ గాలివానకు మా ఇంటి గోడ కూలిపోయినప్పుడూ ఆ నగే ఆదుకుంది.

నేను ఉద్యోగంలో చేరాక మా ఇంటి పరిస్థితి కాస్త బాగుపడింది. యాభై మైళ్ళు ప్రయాణించి ప్రతి శని, ఆదివారాలూ ఇంటికి వెళ్ళేవాడిని.

ఆర్నెల్లకిందట మామ్మకి మలేరియా వచ్చింది. వ్యాధి తగ్గినా మనిషి కోలుకోలేదు. పట్నం తీసుకెళ్తే మంచిదేమో అన్నాడు మా ఊరి డాక్టరు.

“ఏ పట్నాలూ వద్దు. ఒకటా రెండా ఎనభై నెత్తిమీది కొచ్చాయి. ఈ పక్షి లేచిపోవాలంటే కారణం కావద్దూ. పట్టుకుని ఆపాలని ప్రయత్నించకండి” అంది.

మామ్మకి బాగాలేదని తెలిసి అమెరికానుంచి బాబాయి భార్యా సమేతంగా వచ్చి పది రోజులుండి వెళ్ళాడు. “అవసరం అయితే మనిషిని పెట్టి చేయించండి నేను డబ్బు పంపిస్తాను” అన్నాడు.

ఆయన వెర్రి కాకపోతే ఆ ఊళ్ళో మామ్మకు మనిషి సహాయం కావాలంటే అమెరికా డాలర్లు కావాలా? ఆవిడ మంచితనమే చాలు. కో అంటే కోటిమంది వస్తారు.

ఎవరిచేతా చేయించుకోకుండానే భగవన్నామస్మరణ చేసుకొంటూ వెళ్ళిపోయింది. ఇంకా నాలుగు రోజుల్లో పోతుందనగా వెళ్లాను.

“చిన్నా! నా పని ఇప్పుడో... అప్పుడో అన్నట్లు ఉంది. మనిషి ఉన్నప్పుడు కన్నా పోయాకే ఖర్చు ఎక్కువ. మళ్ళీ వాటాలూ వంతులూ అనకమానరు. మీ నాన్నకి కటకటగా ఉంది. నా చంద్రహారం తాకట్టు పెట్టి డబ్బు తీసుకురా. ఇంక తాకట్టు ఎందుకులే, ఏకంగా అమ్మెయ్” అంది.

నాకు కోపం, బాధ ముంచుకొచ్చాయి. “బతికి ఉన్నంతకాలం పిల్లలకోసం తాపత్రయపడింది చాలదా మామ్మా. ఇక తాకట్టు మాట ఎత్తకు” అన్నాను.

“ఎంత పౌరుషం పొడుచుకొచ్చిందిరా చిన్న రామచంద్రయ్యా” అంది నవ్వుతూ.

మా తాతయ్య పేరూ రామచంద్రయ్యగారేగా మరి.

అదే ఆఖరు చూపు... వెళ్లిపోయింది.

మామ్మ పాత గొలుసు కోసం అంత తాపత్రయపడ్డానని అందరూ నన్ను వెర్రివాడిలా చూశారు. వాళ్ళ కంటికది పాత బంగారమే కావచ్చు.

కానీ అది మా మామ్మకు ప్రతిరూపం. మమ్మల్నందరినీ ఆదుకున్న కల్పతరువు. చెక్కుచెదరకుండా అలా ఉండిపోవలసిన తీపి గుర్తు.

నాకన్నీ మా తాతయ్య పోలికలే అనేది మా మామ్మ. తాతయ్య మామ్మకిచ్చిన మాట చెల్లించి మిగిలిన రెండు పేటలూ చేయించాల్సిన బాధ్యత నాదేగా మరి!

*ఈనాడు ఆదివారం జులై 25; 2004*